ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 23.03.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. బిజెపికి వ్యతిరేకంగా చెన్నైలో నిర్వహించిన డీలిమిటేషన్ సమావేశం - దేశంలో లేని సమస్యను సృష్టిండమేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు.

2. బిజెపి బలంగా ఉన్న ప్రాంతాల్లో సీట్లు పెంచి దక్షిణాదిలో తగ్గించేందుకు కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు.

3. రాజీవ్ యువ వికాసం కింద ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నూరు శాతం రాయితీతో 50 వేల రూపాయల రుణం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

4. హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో సన్ రైజర్స్ హైదరాబాద్ , రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఐపిఎల్ మ్యాచ్ ఈ మధ్యాహ్నం ప్రారంభం అవుతుంది.

**కిషన్ రెడ్డి**

బిజెపికి వ్యతిరేకంగా చెన్నైలో నిర్వహించిన డీలిమిటేషన్ సమావేశంపై దేశంలో లేని సమస్యను సృష్టిండమేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ లో ఈరోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నియోజకవర్గాల పునర్విజనపై కేంద్రం ఇంత వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం అపోహాలు సృష్టించడానికి విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన విమర్శించారు. దక్షిణాది ప్రజల సంక్షేమం కోసం కేంద్రం కట్టుబడి వుందని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. చెన్నై లో జరిగిన సమావేశంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ ల మధ్య సంబంధాలు బయటపడ్డాయని వ్యాఖ్యానించారు.

డెస్క్

**కేటీఆర్**

బిజెపి బలంగా ఉన్న ప్రాంతాల్లో సీట్లు పెంచి దక్షిణాదిలో తగ్గించేందుకు కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఆరోపించారు. డీలిమిటేషన్ తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని , ఈ అన్యాన్ని ప్రతిఘటిస్తామని ఆయన ఒక చానెల్ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. జనాభా నియంత్రణ పాటించడం దక్షిణాది రాష్ట్రాలు చేసిన తప్పా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ తో తమ పార్టీ కుమ్మక్కు అయిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తారక రామారావు ఖండించారు.

డెస్క్

**రాజీవ్ యువ వికాసం**

రాజీవ్ యువ వికాసం కింద ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కూడా యూనిట్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్వయం ఉపాధి పథకాల కింద చిరు వ్యాపారాలు చేసే వారి కోసం ప్రత్యేకంగా 50 వేల రూపాయల రుణ పథకాన్ని అమలు చేస్తారు. దీని కింద లబ్ధిదారులకు నూరు శాతం రాయితీతో రుణాలను మంజూరు చేస్తారు. లక్ష రూపాయల లోపు యూనిట్లకు గతంలో 80 శాతం రాయితీ ఉండగా, ఇప్పుడది 90 శాతానికి పెంచుతారు. లక్ష నుంచి రెండు లక్షల లోపు వ్యయం కలిగిన యూనిట్లకు రాయితీని 80 శాతానికి, 2-4 లక్షల యూనిట్లకు 70 శాతంగా నిర్ణయించారు.

(DESK)

**డ్రైవింగ్ లైసెన్స్**

అయిదారు సార్లు నిబంధనలను అతిక్రమించే వాహనచోదకుల డ్రైవింగ్ లైసెన్స్ లను శాశ్వతంగా రద్దు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అలాంటి వారి లైసెన్స్లను మళ్లీ పునరుద్ధరించే ప్రసక్తి లేదని, ఆ వాహనాలు ఇక రిజిస్ట్రేషన్ కావని మంత్రి నిన్న శాసనసభలో చెప్పారు.

(DESK)

**షహీద్ దివస్**

స్వాతంత్ర్య పోరాటంలో అద్భుత శౌర్యాన్ని ప్రదర్శించిన వీర విప్లవకారులు భగత్ సింగ్ , రాజ్‌గురు, సుఖదేవ్ లకు ప్రజలు ఈ రోజు నివాళులు అర్పిస్తున్నా రు. 1928 డిసెంబర్ 17న లాహోర్‌లో బ్రిటిష్ పోలీస్ అధికారి జె.పి. సాండర్స్ ను హత్య చేసిన ఘటనకు సంబంధించి బ్రిటిష్ ప్రభుత్వం వీరిని విచారించి 1931 మార్చి 23న లాహోర్ కేంద్ర కారాగారంలో ఉరి తీసింది. వీరి త్యాగాలను స్మరించుకుంటూ భారత ప్రభుత్వం ప్రతీ ఏటా మార్చి 23న షహీద్ దివస్ పాటిస్తోంది . షహీద్ దివస్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు.

DESK

**ఆసిఫాబాద్- బైట్**

ఆసిఫాబాద్ జిల్లాలో మహిళా రైతులకు వ్యవసాయ యాంత్రికరణ పరికరాలను ఇస్తున్నట్టు జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు మిలింద్ తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాకు రోటవేటర్లు, పనిముట్లు, స్ప్రెయర్ లాంటి 11 రకాల వ్యవసాయ పనిముట్లను అందించడానికి 72 లక్షలు మంజూరు అయ్యాయని ఆయన ఆకాశవాణికి తెలిపారు.

BYTE

(PTC-ASFB)

**BREAK**

ఆకాశవాణి వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ను ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

----------------------

**వాతావరణం**

రాష్ట్రంలో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వానలు కూడా నమోదయయ్యాయి. చత్తీస్ గడ్ నుంచి మహారాష్ట్ర వరకు కర్ణాటక నుంచి దక్షిణ తమిళనాడు వరకు రెండు ద్రోణులు కొనసాగుతున్నందున వాటి ప్రభావంతో ఇవాళ , రేపు కూడా పలు చోట్ల ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

డెస్క్

<u>పంట నష్టం</u>

మంచిర్యాల జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు పలు మండలాల్లో పంట నష్టం జరిగింది. జిల్లాలోని దండపల్లి , హాజీపూర్, లక్షటిపేట, జన్నారం, కోటపల్లి, బెల్లంపల్లి, వేమనపల్లి, మండలాల్లో వరి , మొక్క జొన్న , పంటలతో పాటు మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. లింగపూర్ గ్రామానికి చెందిన రైతు కిషన్ ఆకాశవాణితో మాట్లాడుతూ, దండేపల్లి మండలంలో 85 ఎకరాల వరకు పంటలకు నష్టం వాటిలిందని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బైట్ ... రైతు కిషన్

(PTC-MCRL)

**<u>వర్షాలు- నష్టాలు</u>**

సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ , జహీరాబాద్, మనూరు, ఝూరాసంఘం, కంకోల్ మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం, వడగళ్ళ వల్ల మామిడి, జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. అసలే చలి తీవ్రత , ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఈ ఏడాది తక్కువ ఫల సాయం ఇచ్చిన మామిడి ఇప్పుడు ఈదురుగాలులకు నేల రాలడంతో రైతులు తీవ్ర ఆందోళన

వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి జిల్లాలో అకాల వర్షానికి కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి, కానాయపల్లి, అమడబాకుల గ్రామాలలోని వరి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది.

PTC, SR/WNP

**క్రికెట్**

హైదరాబాద్ లో క్రికెట్ కోలాహలం నెలకొంది. సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య కొద్ది సేపట్లో ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపిఎల్ మ్యాచ్ వీక్షించేందుకు భారీ ఎత్తున అభిమానులు స్టేడియానికి చేరుకుంటున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం అవుతుంది. క్రికెట్ మ్యాచ్ సందర్భంగా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఉప్పల్ వైపు వెళ్లే వాహనాలను హబ్సిగూడ క్రాస్ రోడ్ నుంచి రామాంతాపూర్ నుంచి వచ్చే వాహనాలను స్ట్రీన్ నంబర్ 8 నుంచి ఉప్పల్ క్రాస్ రోడ్ వైపు తరలిస్తున్నారు. ఉప్పల్ స్టేడియం పరిసరాల్లో 450 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. 19 చోట్ల పార్కింగ్ సదుపాయం కల్పించారు. కాగా, ఈరాత్రి 7.30 గటంలకు చెన్నై లో జరిగే మరో ఐపిఎల్ మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్లు తలపడతాయి.

డెస్క్

**మెట్రో**

ఐపిఎల్ సీజన్ దృష్ట్యా హైదరాబాద్ మెట్రో ఎంపిక చేసిన రూట్లలో రైళ్ల వేళలను గంట పాటు పొడిగించారు. ఇప్పటి వరకు ఆఖరి రైలు రాత్రి 11 గంటలకు బయలుదేరుతుండగా , నాగోల్, ఉప్పల్ స్టేడియం , ఎన్జీఆర్ఐ స్టేషన్లలో రాత్రి 12 గంటల 15 నిమిషాలకు చివరి రైలు బయలుదేరుతుంది. ఐపిఎల్ సీజన్ పూర్తయ్యే వరకు ఈ మార్పు అమలులో ఉంటుంది.
ప్రెస్ నోట్

**రోడ్డు ప్రమాదాలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట  మండలంలో జరిగిన రెండు వేరువేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాంధీనగరం దగ్గర బైకును గుర్తు తెలియని వాహనం ఢీ  కొట్టిన ఘటనలో తల్లీకొడుకులు మృతి చెందగా.. ముష్టిబండ సమీపంలో లారీ, డీసీఎం ఎదురెదురుగా వచ్చి ఢీ కొట్టడంతో డీసీఎం డ్రైవర్ చనిపోయాడు.

(PTC-BKGM)

రబీ ధాన్యం

వరంగల్ జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లకు  206 కేంద్రాలు ఏర్పాటు  చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. రబీకి సంబంధిం 2 లక్షల 14 వేల 513 మెట్రిక్ టన్నుల సన్నరకం, 44 వేల 912 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ తెలిపారు.

(PTC-WGL)

**ఎండ్**

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.